# సాహితి (ఉపవాచకం)

## 1. కనువిప్పు

### 15 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. 'కనువిప్పు' నాటిక సారాంశం ఏమిటి ?**

జ. మల్లయ్య కూతురు పుల్లమ్మ. మల్లయ్య తన చెల్లెలు వెంకమ్మ పట్టు పట్టిందని తన మేనల్లుడు వీరయ్యకు, తన కూతురు పుల్లమ్మను ఇచ్చి పెండ్లి చేశాడు. వీరయ్య నగరంలో హాస్టలులో ఉంటూ చదువుకుంటున్నాడు. వీరయ్యకు తండ్రి కొమరయ్య డబ్బు పంపిస్తున్నాడు. మల్లయ్య కూడా వీరయ్య చదువు కోసం వియ్యంకుడికి డబ్బు ఇచ్చేవాడు.

వీరయ్య పట్నంలో చదువుకున్న ఆడపిల్లలతో కలిసి తిరిగాడు. వీరయ్య పట్నం పిల్లల మోజులో పడి, తనకు చదువురాని పుల్లమ్మ అక్కరలేదని తండ్రికి లేఖలు రాసేవాడు. వీరయ్య తండ్రి కొమరయ్యకు కూడా, మొదటినుండీ పుల్లమ్మను కోడలుగా చేసుకోవడం ఇష్టం లేదు. కొమరయ్య కొడుకుకు నచ్చచెప్పడం మాని, తన కొడుకు మనసు విరిగిందనీ, పుల్లమ్మను ఏలుకోడనీ, మల్లయ్యకు కబురుపెట్టాడు.

ఇంతలో వీరయ్య మిత్రుడు రఘు, వీరయ్య అత్తవారింటికి వెళ్ళాడు. మల్లయ్య దంపతులు వీరయ్య ప్రవర్తన గురించి రఘుతో చెప్పి బాధపడ్డారు. రఘు, వీరయ్య, ఒకే గదిలో ఉండి చదువుకుంటున్నారు. రఘు, వీరయ్యకు హితోపదేశం చేశాడు. వీరయ్య కాదంటే పుల్లమ్మ బ్రతుకు పాడవుతుందన్నాడు. వీరయ్య చేస్తున్నపని తప్పని చెప్పాడు. వీరయ్యకు మిత్రుని ఉపదేశంతో, కనువిప్పు కలిగింది.

ఇంతలో వీరయ్య తండ్రి కొమరయ్య తాను పెళ్ళిలో కోడలుకు పెట్టిన నగలను తనకు తిరిగి ఇమ్మని, తిరుపతయ్య అనే పెద్దమనిషిని తీసుకొని, మల్లయ్య దగ్గరకు వచ్చి, పేచీ పెట్టాడు. ఇంతలో కనువిప్పు కలిగిన వీరయ్య, మామ మల్లయ్య వద్దకు వచ్చి, తన తండ్రి ముందే, తనకు భార్య పుల్లమ్మ కావాలనీ, తనకు కనువిప్పు కలిగిందనీ చెప్పి, తన తప్పును అంగీకరించాడు.

**2. కొమరయ్య పాత్ర స్వభావాన్ని వివరించండి ?**

జ. కొమరయ్య, మల్లయ్య సోదరి వెంకమ్మకు భర్త, కొమరయ్య కుమారుడు వీరయ్య కొమరయ్య తనకు ఇష్టంలేకపోయినా భార్య బలవంతంతో తన కుమారుడు వీరయ్యకు మల్లయ్య బావ కూతురు పుల్లమ్మను ఇచ్చి పెళ్ళి చేశాడు. కొమరయ్యకు మిత్రుడు తిరుపతయ్య. తిరుపతయ్య దుష్టుడు. పచ్చని సంసారాలను పాడుచేసేవాడు. చెడ్డ సలహాలు ఇచ్చేవాడు.

కొమరయ్య నగరంలో చదువుకుంటున్న కొడుకు వీరయ్య చదువు పేరు చెప్పి వియ్యంకుడు మల్లయ్య నుండి బాగా డబ్బు గుంజేవాడు. వీరయ్య నగరంలో ఆడవాళ్ళ మోజులో పడ్డాడు. తన భార్య పుల్లమ్మ చదువరానిదనీ, ఆమె తనకు అక్కరలేదనీ తండ్రి కొమరయ్యకు వీరయ్య లేఖలు రాసేవాడు.

దుష్టుడైన కొమరయ్య ఆ లేఖలు చూసి సంబరపడ్డాడు. కొడుకు చేసే పని తప్పని కొడుకును ఏమాత్రమూ ఇతడు మందలించలేదు. తన కొడుకు మనసు విరిగిందనీ, పుల్లమ్మను ఇష్టపడటంలేదనీ వియ్యంకుడికి కబురు పంపాడు. బలవంతంగా పెళ్ళి చేయించిందని తన భార్యను నిందించాడు. తిరుపతయ్య మాటలు విని, కొడుకుకు మరో పెళ్ళి చేద్దామనుకున్నాడు.

పెళ్ళిలో పుల్లమ్మకు పెట్టిన నగలను తిరిగి ఇచ్చివేయమని వియ్యంకుడి వద్దకు వచ్చి ఇతడు పేచీ పెట్టాడు. మల్లయ్య ఎంత బ్రతిమాలినా ఇతడు వినలేదు.

చివరకు ఇతని కొడుకు బుద్ధిమంతుడై భార్యను ఏలుకొంటానని ఇతడి ముందే చెప్పాడు. వీరయ్యకు మిత్రుడి హితోపదేశం ద్వారా కనువిప్పు కలిగింది. కొమరయ్యకు మాత్రం బుద్ధి రాలేదు. మిత్రుడు తిరుపతయ్యతో కలసి కోపంగా ఇంటికి వెళ్ళాడు.

## సందర్భ సహిత వాఖ్యలు

**1. ఇది మీ ఊరనుకోను, అనుకున్నట్లా సాగిరావడానికి**

**కవి పరిచయం :** ఈ వాక్యం వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'కనువిప్ప నాటికలోని మూడోరంగంలోనిది.

**సందర్భం :** మల్లయ్య వియ్యంకుడు కొమరయ్య మల్లయ్య తన కుమార్తె పుల్లమ్మను కొమరయ్య పుత్రుడు వీరయ్యకు ఇచ్చి పెళ్ళి చేశాడు. వీరయ్య పట్టణంలో చదువుకుంటున్నాడు. అక్కడ పట్టణంలోని ఆడపిల్లల మోజులో వీరయ్య పడ్డాడు. తనకు తన భార్య పుల్లమ్మ అక్కరలేదన్నాడు.

దానితో వీరయ్య తండ్రి కొమరయ్య తిరుపతయ్య అనే పెద్దమనిషితో వియ్యంకుడు మల్లయ్య దగ్గరకు వచ్చి, తన కొడుకుకు, పుల్లమ్మపై మనసు లేదనీ పెళ్ళిలో తాము పెట్టిన నగ, నట్ర తిరిగి తనకు ఇమ్మనీ, వియ్యంకుడు మల్లయ్యను బలవంతం చేశాడు.

అప్పుడు మల్లయ్య ఊరిలో పెద్దమనిషి రంగయ్య కలుగజేసుకొని, కొమరయ్యతో "నీ ఇష్టం వచ్చినట్లు సాగించుకోటానికి ఇది మీ ఊరు కాదు" అని కొమరయ్యపై ఎదురుతిరిగిన సందర్భంలోనిది.

**అర్థం :** "ఈ గ్రామం మీ గ్రామం అనుకోవద్దు. నీవు అనుకొన్న విధంగా కలసిరావడానికి".

**వ్యాఖ్య :** మీ గ్రామంలో అయితే, నీవు అనుకున్న విధంగా సాగుతుందేమో, కాని ఈ ఊరిలో అల్లాసాగదు" అని మల్లయ్య మిత్రుడు రంగయ్య, కొమరయ్యపై ఎదురు తిరిగాడు.

**2. చిలుకా గోరింకోలె హాయిగా ఉండొచ్చు.**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'కనువిప్పు నాటికలోని రెండవ రంగంలోనిది.

**సందర్భం :** వీరయ్యకు పెళ్ళి అయ్యింది. మేనమామ కూతురు పుల్లమ్మను పెళ్ళాడాడు. పట్టణంలో హాస్టల్లో ఉండి తండ్రి కొమరయ్య పంపిన డబ్బుతో చదువుకుంటున్నాడు. కొమరయ్యకు మిత్రుడూ, పెద్దమనిషి అయిన తిరుపతయ్య తుంటరి. తిరుపతయ్య వీరయ్య దగ్గరకు వచ్చి, వీరయ్య మామపై అబద్ధాల చెప్పాడు.

వీరయ్య బాగా చదువుకున్నవాడనీ వీరయ్య పెళ్ళి చేసుకున్నపిల్ల పుల్లమ్మ, అడివి మనిషి అనీ, ఆ పుల్లమ్మతో కాపురం చేయడం వీరయ్యకు కష్టమనీ తిరుపతయ్య వీరయ్యతో అన్నాడు.

వీరయ్య పుల్లమ్మను విడిచి, మరో చదువుకున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే చిలుక, గోరింకలవలె హాయిగా ఉండవచ్చునని తిరుపతయ్య వీరయ్యకు దుర్బోధ చేసిన సందర్భంలోనిది.

**అర్థం :** చిలుక, గోరింకలు జంటగా ఉన్నట్లు సుఖంగా ఉండవచ్చు.

**వ్యాఖ్య :** పుల్లమ్మ, వీరయ్యల జంట బాగోలేదనీ, వీరయ్య మరో చదువుకున్న పిల్లను చేసికొంటే వారు చిలుకా గోరింకలవలె సుఖంగా జీవించవచ్చుననీ తిరుపతయ్య వీరయ్యను ప్రోత్సహించాడు.

✲✲✲